
సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 9 । ఆగస్టు । 2025



కమ్ముకొస్తున్న కరువు మేఘం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. వర్షాలు కురవడం లేదు. కరువు మేఘం కమ్ముకొస్తుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. -8లో



గండి అంజన్న దర్శనానికి ఏర్పాట్లు

శ్రావణమాసంలో మూడో శనివారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. -8లో

గరిష్టం/కనిష్టం
38.0/22.0

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 22.0 - 38.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు మైలవరం నుంచి పెన్నాకు నీటి విడుదల

జమ్మలమడుగు: కృష్ణా జలాలు వస్తుండటంతో గండికోట ప్రాజెక్టులో 16 టీఎంసీలకు చేరుకున్నాయి. దీంతో గండికోట నుంచి మైలవరం జలాశయానికి అధికారులు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 15 టీఎంసీలు, మైలవరం ప్రాజెక్టులో 4.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పెన్నా నదికి శనివారం ఉదయం పది వేల క్యూసెక్కుల నీటిని నెల్లూరు జిల్లా సోమశిల ప్రాజెక్టుకు తరలించేందుకు విడుదల చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ నేపథ్యంలో వేపరాల, దొమ్మరనంద్యాల, జమ్మలమడుగు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కేంద్ర బృందం పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

జమ్మలమడుగు: కేంద్ర ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయిలో అమలవుతున్న తీరుపై తెలుసుకునేందుకు కేంద్ర బృందం పర్యటించింది. శుక్రవారం ఎర్రగుంట్ల మండలం చిలంకూరు గ్రామ పంచాయతీలో సామాజిక పెన్షన్లు, ఉపాధి హామీ, హౌసింగ్ పనులను బృందం సభ్యులు పరిశీలించారు. రికార్డుల ఆధారంగా క్షేత్ర స్థాయిలో ప్రధాన మంత్రి రోజ్ గార్ యోజన పథకం కింద హౌసింగ్ నిర్మాణాలతోపాటు ఉపాధి పనులు ఎక్కడెక్కడ జరిగాయో పూర్తి స్థాయిలో తెలుసుకుని కూలీలతో మాట్లాడారు.

కొనసాగుతున్న వర్షాలు

కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో మూడు రోజుల నుంచి వర్షాలు కొనసాగుతున్నాయి. ఈ వానలు ఆరుతడి పంటలకు జీవం పోసినట్లయింది. అలాగే ఎండల వేడితో ఏపుగా పెరగని వరినాట్లకు కూడా ఎంతో మేలని పలువురు రైతులు తెలిపారు. పంటలకు ఆశించిన చీడపీడలు కూడా తగ్గనున్నాయి. జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున వేంపల్లిలో అత్యధికంగా 78.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అలాగే ఎర్రగుంట్లలో 64 మి.మీ, కలసపాడులో 42.6, సిద్దవటం 40.8, కమలాపురం 32.2, పెండ్లిమర్రి, లింగాలలో 31.2, ఒంటిమిట్ట 30.8, ఖాజీపేట 27.6, చక్రాయపేట 26, వేముల 25.2, చింతకొమ్మదిన్నె 23.2, కడప 14.4, చెన్నూరు 13.4, అట్లూరు 13, వల్లూరు 11.8, తొండూరు 8.4, పులివెందుల 7.4, గోపవరం 7.2, వీఎన్‌పల్లి 5.8, బద్వేలు 5.4, మైలవరం 4.6, ప్రొద్దుటూరు 2.2, జమ్మలమడుగులో 2 మి.మీ వర్షపాతం నమోదైంది.

పచ్చని సీమలో..
నెత్తుటి రాజకీయం



- 30 ఏళ్ల ప్రేరణను 3 రోజుల్లో కూల్చిన ఎల్లోగ్యాంగ్
- వైఎస్సార్ కృషి ఫలితంగా కనుమరుగైన ఫ్యాక్షన్ సంస్కృతి
- అపారంగా పెరిగిన ఉద్యాన పంటలు
- ఉన్నత చదువులతో వృద్ధి
- దేశ, విదేశాలకు ఎగుమతుల్లో పులివెందుల టాప్
- అధికారంలోకి వచ్చాక రెచ్చిపోతున్న టీడీపీ గూండాలు
- జెడ్పీటీసీ ఎలక్షన్ కోసం ప్రశాంతతకు భంగం





పులివెందుల ప్రాంతంలో సాగులో ఉన్న చీనీ తోట (ఇన్‌సెట్) టీడీపీ గూండాల దాడిలో గాయపడ్డ రామలింగారెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: ఒకప్పుడు పులివెందులలో ఎన్నికలంటే యావత్తు సమాజం అప్రమత్తంగా ఉండేది. ఎప్పుడు, ఎలాంటి ఘటన చోటుచేసుకుంటుందోనన్న భయానక ఉద్రిక్తత పరిస్థితులు ఉండేవి. కాలక్రమేణ గణనీయమైన మార్పు వచ్చింది. అందుకు అధికారుల కృషి, పాలకుల స్ఫూర్తిదాయక చర్యలు కారణం. సామాజిక పరిస్థితుల్లో మార్పు, అధికారుల ప్రేరణ వెరసి పులివెందులలో ప్రశాంత వాతావరణం ఉండేది. తాజాగా తద్భిన్నమైన పరిస్థితులు తెరపైకి వచ్చాయి. 30 ఏళ్ల క్రితం ఉత్పన్నమయ్యే ఉద్రిక్తతలు పులివెందులలో తిష్టవేశాయి. జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పనిగట్టుకొని ప్రభుత్వ పెద్దలు హింసను ప్రోత్సహిస్తుండటమే అందుకు ప్రధాన కారణం.

కరువు సీమలో సిరులు

ఒకప్పుడు పులివెందుల ప్రాంతంలో వ్యవసాయం చేయాలంటే సాధ్యమయ్యేది కాదు. భూగర్భజలాలు అడిగింటిపోయి.. వెయ్యి అడుగులు లోతు బోర్లు వేసినా.. నీళ్లు పడతాయనే గ్యారెంటీ లేదు. వర్షాధారమే అక్కడి రైతులకు జీవనాధారం. అలాంటి ప్రాంతంలో సిరులు కురిపించేలా చేసింది వైఎస్ కుటుంబం. ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి పులివెందుల సస్యశ్యామలానికి శ్రీకారం చుట్టారు. ఆయన చేపట్టిన జలయజ్ఞాన్ని ముందుకు నడిపించిన నేతలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి. ఫలితంగా పులివెందుల ప్రాంతంలో పండిస్తున్న పంటలు ఇతర దేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయంటే, వారు కల్పించిన సాగునీటి వనరులే కీలకం. వెరసి టిష్యూకల్చర్ అరటి మూడు కాయలు, ఆరు గెలలుగా పులివెందులలో విస్తరించింది.

దారిద్ర్యం నుంచి ఉన్నత స్థితికి...

పులివెందుల.. ఈ పేరు చెబితే ఒకప్పుడు కరువుకు చిరునామాగా ఉండేది. సరైన సాగునీటి వనరులు లేక.. ఉన్న వసతులు కూడా కేవలం వర్షాధారంపైనే ఆధారపడటంతో రైతులు ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి. అప్పట్లో చిత్రావతి రిజర్వాయర్ సామర్థ్యం 2 టీఎంసీలు. పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు ఎప్పుడు నీళ్లొస్తాయో, వచ్చిన నీళ్లు పంట పొలాలకు చేరతాయో లేదో కూడా తెలిసేది కాదు. ఇక చెరువులు వర్షం పడితేనే నిండేవి. అలాంటి కష్టాలను కళ్లారా చూసిన వ్యక్తి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. ఎలాగైనా తమ ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకురావాలని కంకణం కట్టుకున్నారు. గాలేరు నగరి సుజల స్రవంతి కార్యక్రమాన్ని ఆనాడు డాక్టర్ వైఎస్సార్ చేపడితే, దాన్ని ముందుకు సాగించి పులివెందుల వరకూ కృష్ణాజలాలు పారేలా చేసింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ముఖ్యమంత్రులుగా వీరిద్దరూ పులివెందుల రైతుల కోసం చేసిన సేవల ఫలాలు ఇప్పుడు రైతులు అనుభవిస్తున్నారు.



పైడిపాళెం ఏర్పాటుతో...

పైడిపాళెం రిజర్వాయర్ నిర్మాణం, చిత్రావతి విస్తరణతో పులివెందుల రూపురేఖలు మారిపోయాయి. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆనాడు నిర్మించిన గండికోట ప్రాజెక్టు నుంచి పైడిపాలెం రిజర్వాయర్‌కు 6 టీఎంసీల నీటిని తీసుకొచ్చారు. అదే గండికోట రిజర్వాయర్ నుంచి 12 లిఫ్టుల ద్వారా నీటిని చిత్రావతి రిజర్వాయర్‌కు నింపారు. రెండు వైపులా రిజర్వాయర్లు పెట్టి అక్కడి నుంచి చెరువులకు నీళ్లు వదలడంతోపాటు చిత్రావతి నుంచి వేంపల్లి వరకూ కాల్వలు తవ్వించారు. ఒకప్పుడు వెయ్యి అడుగులు తవ్వినా పడని నీరు ఇప్పుడు పంటలకు పుష్కలంగా అందుతోంది. మరో వైపు పులివెందుల బ్రాంచ్ కెనాల్‌ను అభివృద్ధి చేశారు. పులివెందుల నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సాగునీరు అందేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రణాళిక, అమలులో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషి ఫలించింది.



చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

ఇప్పుడు అదే కరువు సీమలో అరటి పండించి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. చీనీ తోటలు పచ్చగా పెరిగి అధిక దిగుబడిని ఇస్తున్నాయి.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో...

ఓ వైపు వ్యవసాయం కళకళలాడుతోంది. మరోవైపు మెట్ట ప్రాంతంలోని అగ్రకులాలకు చెందిన విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం వరంగా నిలిచింది. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ పథకం ప్రవేశ పెట్టడంతో ఎంతోమంది ఉన్నత చదువులు చదివి, అత్యున్నత ఉద్యోగాలు సాధించారు. మరోవైపు 2000వ సంవత్సరం నుంచి పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తుండటం, ఇంటింటా ఉద్యోగులు కొలువై ఉండటం, లాభసాటి వ్యవసాయం ఇవన్నీ ఫ్యాక్షన్ కనుమరుగయ్యేందుకు సాధ్యమైంది. దాదాపు 20 ఏళ్లుగా పూర్తి ప్రశాంత వాతావరణంలో ప్రజలు జీవిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకున్నారు.

తెరపైకి వస్తున్న నాటి భయోత్పాతం

'ఎవరేం అనుకుంటే నాకేంటి సిగ్గు.. మేం అరాచకమే చేస్తామంటోంది' పులివెందులలో తెలుగుదేశం పార్టీ. పెద్దల అండదండలు, పోలీసుల బలం, సహకారం మెండుగా ఉండటంతో ఒక చిన్న జెడ్పీటీసీ ఉప ఎన్నికలో అరాచకానికి తెరలేపారు. వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా దాడులు చేసి హత్య చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితులు ఫిర్యాదు చేసినా, వారం క్రితం నుంచి టీడీపీ మూకలు దాడుల మీద దాడులు చేస్తున్నా.. పోలీసులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

- మూడు దశాబ్దాలుగా అధికారుల చేసిన కృషి, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి దీర్ఘకాలిక ప్రయోజనాలతో చేపట్టిన పథకాలు అన్నీ కలగలిపి పులివెందులలో ప్రశాంతత కొనసాగుతోంది. కాగా, చిన్న జెడ్పీటీసీ కోసం ఏమి చేసినా సరే, ఎలాంటి నిర్ణమైన ఓకే, గెలుపే లక్ష్యం కావాలంటూ ప్రభుత్వ పెద్దలు హెచ్చరికలు జారీ చేస్తుండటంతో మరింతగా టీడీపీ శ్రేణులు రెచ్చిపోతున్నాయి. 30 ఏళ్ల క్రితం వేసిన బీజాలు సత్ఫలితాలు ఇస్తుంటే, మూడు రోజులల్లో ఎల్లోగ్యాంగ్ కూల్చివేసింది. మళ్లీ విషసంస్కృతి బీజాలు వేస్తోంది. ఈ పోకడ ఎటువైపు దారి తీస్తుందోనని ప్రజాస్వామ్యవాదులు మథనపడుతున్నారు.

ఒక జిల్లా అధికారి.. ఐదు పోస్టులు!

మదనపల్లె: జిల్లా సహకారశాఖలో వింత పరిస్థితులు నెలకొన్నాయి. ఎక్కడైనా ఒక పోస్టు ఖాళీ ఉంటే.. కింది అధికారినో లేక పై అధికారికో కొన్నాళ్లు అదనపు బాధ్యతలను అప్పగించడం సాధారణ విషయం. అదికూడా పాలనాపరమైన సౌలభ్యం కోసం. అయితే సహకార శాఖలో నెలకొన్న పరిస్థితులు ఆశ్చర్యపోయేలా ఉన్నాయి. జిల్లా సహకారశాఖ అధికారికి ఐదు పోస్టులకు ఇన్‌చార్జి అధికారిగా బాధ్యతలు అప్పగించారు. ఇక ఆయన ఎక్కడి నుంచి విధులు నిర్వహిస్తారో కాని సహకార శాఖ పాలనాపరంగా కుదేలైంది. వివరాల్లోకి వెళితే.. జిల్లా సహకార శాఖ అధికారిగా సి.గురుప్రసాద్‌రావు విధులు నిర్వహిస్తున్నారు. మదనపల్లె, రాజంపేట సహకార డివిజనల్ కార్యాలయాలు ఉండగా వాటికి డీఎల్‌సీఓలు లేరు. మదనపల్లెకు కొంతకాలం ఇన్‌చార్జి డీఎల్‌సీగా శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి బాధ్యతలు నిర్వహించారు. తర్వాత ఏమైందో ఆయన్ను తొలగించారు. దీంతో మదనపల్లె డీఎల్‌సీఓ పోస్టు ఖాళీ కావడంతో డీసీఓయే ఎఫ్‌సీ డీఎల్‌సీఓగా బాధ్యతలు స్వీకరించారు. రాజంపేట డీఎల్‌సీఓ పోస్టు కూడా ఖాళీగా ఉండటంతో ఆ పోస్టు ఇది కూడా డీసీఓకే ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. ఈ రెండు బాధ్యతలు చేపట్టిన ఆయనకు జిల్లా సహకారశాఖ ఆడిట్ అధికారి పోస్టు కూడా అదనంగా కట్టబెట్టారు. జిల్లాకు సంబంధించి ఈ పోస్టుల విధులను నిర్వహించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆయనకు వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు, కడప డీఎల్‌సీలు సెలవులో వెళ్లడంతో ఈ రెండు బాధ్యతలను అప్పగించారు. ఈనెల 11 వరకు వీరిద్దరు సెలవు పెట్టారు. 12న తిరిగి విధుల్లోకి చేరేదాకా రాయచోటి డీసీఓ ఐదు పోస్టులకు ఏక్ నిరంజన్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తారు. దీనిపై డీసీఓ గురుప్రసాద్‌రావు మాట్లాడుతూ పోస్టులు ఖాళీగా ఉండటంతో తనను ఇన్‌చార్జిగా నియమించారని చెప్పారు.

ఎన్నికల భగ్నానికి
కూటమి నాయకుల యత్నం

- ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు
- ఓటింగ్ శాతం తగ్గించేందుకు పోలింగ్ కేంద్రాల మార్పు
- కలెక్టర్‌కు విన్నవించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి



కలెక్టర్‌ను కలిసి వస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, పులి సునీల్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రజాస్వామ్యయుతంగా జరగాల్సిన జెడ్పీటీసీ ఉప ఎన్నికను భగ్నం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికకు పోలింగ్ కేంద్రాల మార్పు చేయరాదని కలెక్టర్ చెరుకూరు శ్రీధర్‌ను శుక్రవారం ఆయన కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కుట్ర రాజకీయాలు చేస్తోందన్నారు. ఇప్పటికిప్పుడు ఒక ఊరు నుంచి మరో ఊరికి పోలింగ్ కేంద్రాలను మార్పు చేయడంతో ప్రజలు ఓటు వేసేందుకు రెండు, మూడు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందన్నారు. వారి కుట్రలేవీ పనిచేయవన్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారం కోసం వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, నాయకులు రామలింగారెడ్డిలపై కూటమి నాయకులు దాడిచేసి చేయి విరగ్గొట్టారన్నారు. ఇవన్నీ మనం సినిమాల్లోనే చూసేవారమని.. ఇప్పుడు రియల్‌గానే చూస్తున్నామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా జరగలేదా? అని ప్రశ్నించారు. 2024లో బీటెక్ రవి పోటీ చేసినప్పుడు ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని, ఎక్కడా రీపోలింగ్ జరిగిన దాఖలాలు లేవని అన్నారు. ప్రజలను బయభ్రాంతులకు గురిచేసి ఎన్నికల్లో గెలవాని కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. పోలింగ్ కేంద్రాలను మార్చడం చూస్తుంటే.. పరీక్షల సమయంలో జంబ్లిగ్ విధానం గుర్తుకు వస్తోందన్నారు. కేంద్రాలను మార్చిన విషయాన్ని ఎన్నికల కమిషన్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తాము గతంలో ఇలా చేసి ఉంటే నారా లోకేష్ ప్రజాగళం యాత్ర, పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర చేసేవారే కాదన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పులి సునీల్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

- జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్ రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించండి
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్
- ఐదు రోజులుగా జోరుగా జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారం



ఇ.కొత్తపల్లె ప్రచారంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డి వెంట పెద్ద ఎత్తున పాల్గొన్న కార్యకర్తలు, అభిమానులు



వైఎస్సార్‌సీపీ అభ్యర్థి హేమంత్‌రెడ్డితో కలిసి ప్రచారం చేస్తున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

పులివెందుల/వేంపల్లె: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గత ఐదు రోజులుగా పులివెందుల మండలం జెడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రచారం జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డిలతో కలిసి పులివెందుల మండల పరిధిలోని చంద్రగిరి, ఇ.కొత్తపల్లి గ్రామాల్లో జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి తుమ్మల హేమంత్ రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రచారానికి వెళ్లిన నాయకులకు ఆ గ్రామ అభిమానులు, ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ పూల వర్షం కురిపించారు. ఎక్కడ చూసినా బాణా సంచా పేల్చుతూ సంబరాలు జరుపుకొన్నారు. గ్రామాల్లోని ప్రజల సమస్యలను వింటూ ప్రచారాన్ని ముందుకు సాగించారు. త్వరలోనే గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ఆయా గ్రామాల ప్రజల ఉత్సాహాన్ని చూసి జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కచ్చితంగా అఖండ మెజార్టీతో గెలవడం తథ్యమని పేర్కొన్నారు. మాట తప్పని.. మడమ తిప్పని కుటుంబం వైఎస్సార్ కుటుంబమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడాది దాటినా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేదన్నారు. హామీ ఇచ్చిన పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రవేశపెట్టిన పథకాలైన విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ తదితర పథకాలను నీరుగార్చారన్నారు. పులివెందుల నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాయంటే అది కేవలం వైఎస్ కుటుంబంతోనేనన్నారు.

ప్రజల నుంచి విశేష స్పందన

ప్రచారంలో ప్రజల నుంచి వైఎస్సార్‌సీపీకి విశేష ఆదరణ లభిస్తోంది. తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్ని ప్రభోవాలు పెట్టినా.. వైఎస్ కుటుంబానికి అండగా ఉంటామని ప్రజలు అంటున్నారు. మహిళలకు ఉచిత బస్సు, ఏడాదికి రూ.18వేలు అని నమ్మబలికి ఏ పథకం అమలు చేయలేదని వారు పేర్కొన్నారు. కావున జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటూ ఆ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి, బాల ఓబుల్ రెడ్డి, మోహన్ రెడ్డి, బాల గంగిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఆది, చంద్ర, గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 40 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

పులివెందుల మండలం ఇ.కొత్తపల్లె గ్రామంలో టీడీపీ నుంచి 40 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. శుక్రవారం జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో బాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో 40 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కడప ఎంపీ వైఎస్ అవినాస్‌రెడ్డి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వంలో చేస్తున్న దాడులు, హింసలు, అరాచకాలను చూసి ఇష్టపడక వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, బలరామిరెడ్డిలకు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు.



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరుతున్న నాయకులు

ప్రజాస్వామ్యంపై నమ్మకం లేకే దాడులు

- పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైంది
- గెలవడమంటే పేకాట ఆడినంత ఈజీ కాదు
- మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

పులివెందుల: పులివెందుల జెడ్పీటీసీ స్థానం పరిధిలోని ప్రతి ఓటరు కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలాగా భావించి ఎన్నికల్లో ఓటు వేస్తారని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ధీమా వ్యక్తం చేశారు. కొత్తపల్లిలో జెడ్పీటీసీ ప్రచారం సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వారు ఓటుకు రూ.10 వేలు, ఇంటికి రూ.20 వేలు అన్న నినాదంతో ముందుకుపోతున్నట్లు తెలుస్తోందన్నారు. బీటెక్ అయినా, ఎంటెక్ అయినా, లోటెక్ అయినా ఏ టెక్కు ట్రిక్కులు ఇక్కడ పని చేయవని.. కచ్చితంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. బీటెక్ రవి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిలు టీడీపీ అభ్యర్థిని గెలిపిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని, ఎన్నికల్లో గెలవడం క్లబ్‌లో పేకాట లేదా పబ్‌లో డ్యాన్స్‌లు వేసినంత ఈజీ కాదన్నారు. ఇక్కడ ప్రతి ఒక్క మనిషి కూడా వైఎస్ జగన్, వైఎస్ కుటుంబానికి కనెక్ట్ అయ్యి ఉన్నారని.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అఖండమైన విజయం సాధిస్తారన్నారు. తెలుగుదేశం పార్టీ కానీ, కూటమి ప్రభుత్వం కానీ లేదా ఆ పార్టీలకు సారథ్యం వహిస్తున్న ఎవరొచ్చి ఇక్కడ ప్రచారం చేసినా అది నామమాత్రంగానే ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఎప్పుడైతే గెలవలేమని నిరాశ, నిస్పృహలకు మనిషి వస్తారో అప్పుడే అరాచకాలకు తెగబడతారని.. ఈ నేపథ్యంలో వేల్పుల రాము, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌లపైన దాడి చేశారన్నారు. అది వారి దివాలాకోరుతనానికి, వాళ్లకు ఓట్లు పడవు అనడానికి నిదర్శనమన్నారు. ఈ దాడులను ప్రభుత్వం కట్టడి చేయకుండా ఇలాగే చేసుకుంటూ పోతే దానికి తగిన రీతిలో బుద్ధి చెప్పడానికి కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎవరైతే బాధితులున్నారో ఎవరికైతే గాయాలయ్యాయో ఎవరిపైనైతే దౌర్జన్యం చేశారో వారి కంప్లయింట్ తీసుకుని ధర్మంగా కేసు కట్టాలని, దాన్ని పక్కకు వదిలేసి కొత్త రకమైన తీర్పునకు పోలీసులు శ్రీకారం చుట్టారన్నారు. అంతేకాకుండా సాక్షాత్తూ డీఐజీ నోటి వెంటే ఇంతకు ముందు ఫ్యాక్షనిస్టులో, నక్సలిస్టులో మాట్లాడే మాటలను వింటూ ఉన్నామని, ఇలాంటి పోలీసు వ్యవస్థను ఎప్పుడూ చూడలేదన్నారు. ఈ జిల్లాలోనే తాను సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశానని, అప్పట్లో ఇక్కడ పని చేసిన పోలీసు అధికారులు బాధితులకు న్యాయం జరిగేలా, లా అండ్ ఆర్డర్ కంట్రోల్‌లో ఉండే విధంగా పని చేసే వారన్నారు. ప్రస్తుతం దానికి తిలోదకాలు ఇచ్చేశారని, ఇది చాలా దురదృష్టకరమని భావించవచ్చునన్నారు. పులివెందుల వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఉత్సాహం కానీ లేదా ప్రజల విశ్వాసం కానీ చూస్తే ఇక్కడ ఎప్పటికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడేది లేదు.. తెలుగుదేశం పార్టీ, కూటమి పార్టీ గెలిచేది లేదని నిక్కచ్చిగా చెప్పవచ్చున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో న్యాయవాది దుర్మరణం


శ్రీనువాసులురెడ్డి (ఫైల్)

వల్లూరు : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండలంలోని శ్రీసత్యా గ్రీన్‌సిటీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాయపల్లె గ్రామానికి చెందిన న్యాయవాది డి.శ్రీనివాసులురెడ్డి(46) మృతిచెందారు. ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపిన సమాచారం మేరకు... న్యాయవాది శ్రీనువాసులురెడ్డి తన గ్రామం గంగాయపల్లె నుంచి బైక్‌లో కడపకు వెళ్తున్నారు. మార్గ మధ్యంలో శ్రీసత్యా గ్రీన్ సిటీ వద్దకు రాగానే కడప ఆర్టీసీ బస్సు డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో మృతుడు తన బైక్‌ను బస్సు వెనుకభాగాన ఢీకొన్నాడు. మృతునికి తీవ్ర గాయాలవగా, చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడపకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసులురెడ్డి మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. మృతుడికి భార్య, ఆరు నెలల పాప ఉన్నారు.

చికిత్స పొందుతూ మరొకరు...


భూమిరెడ్డి సుబ్బిరెడ్డి(ఫైల్)

బ్రహ్మంగారిమఠం : భూ సమస్యలతో పురుగు మందు తాగిన లింగాలదిన్నె పల్లెకు చెందిన భూమిరెడ్డి సుబ్బిరెడ్డి ప్రాణాలు కొట్టుమిట్టాడుతూ ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందాడు. గత సోమవారం పురుగులమందు తాగి ఆయన ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. మృతుడి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మండలంలోని లింగాలదిన్నెపల్లెకు చెందిన తెదేపా నేత లెక్కల రమణారెడ్డి, మరికొందరు భూ సమస్యపై సుబ్బిరెడ్డిపై ఒత్తిడి తేవడంతో మానసికంగా కుంగిపోయారని, సోమవారం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడన్నారు. 108లో ప్రొద్దుటూరు ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా శుక్రవాంర ప్రాణాలు వదిలారని తెలిపారు. సుబ్బిరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఈ మధ్య ఒక్కగానొక్క కుమారుడు ఆత్మహత్య చేసుకోగా, ఇపుడు భర్త మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని సుబ్బిరెడ్డి భార్య, పిల్లలు కోరుతున్నారు.

లారీ ఢీకొని గొర్రెలు మృతి

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలోని ఈద్గా సమీపంలో శుక్రవారం గొర్రెల మందపై ఓ లారీ దూసుకెళ్లింది. ఈ సంఘటనలో పది గొర్రెలు అక్కడికక్కడే దుర్మరణం చెందాయి. గొర్రెలను మేతకు తీసుకెళ్తుండగా లారీ ఢీకొని మృతి చెందాయని, వాటి విలువ రూ.80 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

ఒంటిమిట్ట : మండలంలోని కొండమాచుపల్లి–బాపనపల్లి మార్గంలో మదు శ్రీనివాస రెడ్డి(46)ఎనిమిది మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఏకశిలానగరిలో వేడెక్కిన ప్రచారం

- టీడీపీ అభ్యర్థికి మద్దతుగా మంత్రులు
- పలు గ్రామాల్లో వైఎస్‌ఆర్‌సీపీ నేతల ప్రచారం
- ఎన్నికలకు గడువు దగ్గర పడుతుండటంతో పోలింగ్‌పై దృష్టి సారించిన పోలీసులు


మృకుందాశ్రమంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న , మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి


చిన్నకొత్తపల్లిలో అభ్యర్థితో కలిసి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

సాక్షి, రాయచోటి : కూటమి సర్కార్ జెడ్పీటీసీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో అడ్డదారుల వైపు అడుగులు వేస్తోంది. సాధారణ జెడ్పీటీసీ ఎన్నికలకు కూడా మంత్రులు మకాం వేసి అధికార దుర్వినియోగం చేయడం ఇందుకు అ ద్దం పడుతోంది. ఎలాగైనా సరే గెలవాలనే సంకల్పంతో అవసరమైన అన్ని వనరులను ఉపయోగిస్తున్నా రు. అధికారంలో ఉండడంతో తాము ఓటమి పాలైతే సర్కార్ ప్రతిష్ట మంటగలుస్తుందనే ఆలోచనతో ఇతర పార్టీలవారిని భయపెట్టడమో.. ఆదుకుంటామని చెబుతూ పార్టీలో చేర్చుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. ఏళ్ల చరిత్రను పరిశీలిస్తే ఒంటిమిట్ట, పులివెందుల లాంటి కేంద్రాల్లో తిరుగులేని ఆధిక్యత వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీదే. ఇప్పటికే ఒంటిమిట్ట వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి మద్దతుగా పార్టీ నేతలు జోరుగా ప్రచారం చేస్తున్నారు.

గెలుపే లక్ష్యంగా..

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు అడుగులు వేస్తున్నాయి. ఎక్కడికక్కడ ప్రజల్లో పట్టున్న వారితో చర్చించడంతోపాటు ఓట్లు భారీగా పడేలా వ్యూహరచన చేస్తున్నారు. మరోపక్క ప్రచారంలో ప్రజలతో కలిసిపోయి... వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నారు. ఓటు వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థికి వేయాలంటూనే ఎన్నికల ముందు హామీలిచ్చి తరువాత విస్మరించిన కూటమి సర్కార్ మోసాలను కూడా వివరిస్తున్నారు. టీడీపీ వేస్తున్న ఎత్తుగడలను ఎప్పటికప్పుడు చిత్తు చేస్తూ వైఎస్‌ఆర్‌సీపీ శ్రేణులతో పాటు నేతలు ప్రచారంలో దూసుకుపోతున్నారు.

జోరుగా వైఎస్‌ఆర్‌సీపీ నాయకుల ప్రచారం

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కూడా చింతరాజుపల్లెలో కడప పార్లమెంట్ పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యంలు ప్రచారం నిర్వహించారు. అలాగే మృకుంద ఆశ్రమంలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, రాజంపేట పార్లమెంట్ పరిశీలకులు, కడప నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, యువజన విభాగం నాయకులు దేవిరెడ్డి ఆదిత్యలు ప్రచారం చేశారు. కోదండరామనగర్, మంటపంపల్లి తదితర ప్రాంతాలను మాజీ ఎమ్మెల్యే, వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యంలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గంగపేరూరు పంచాయతీలోని చిన్నకొత్తపల్లెలో బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఆయన కుమారుడు ఆదిత్యరెడ్డి, జడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఏకుల రాజేశ్వరి తదితరులు ప్రచారం నిర్వహించారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో సుబ్బారెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అయితే ప్రజల నుంచి కూడా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి అపూర్వ సంపూర్ణమద్దతు లభిస్తోంది.

ఒంటిమిట్ట మండలంలో జెడ్పీటీసీ అభ్యర్థి కృష్ణారెడ్డికి మద్దతుగా రాష్ట్ర మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఫరూక్ లతో పాటు పలువురు నాయకులు ప్రచారం నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఒంటిమిట్ట జెడ్పీటీసీకి సంబంధించి ఈ నెల 12వ తేదీన ఎన్నిక జరగనున్న నేపథ్యంలో జిల్లా అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఒంటిమిట్టతో పాటు మంటపంపల్లి, ఇతర అన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్, ఇతర అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించారు. ఎక్కడికక్కడ అవసరమైన చర్యలు చేపట్టాలను కింది స్థాయి అధికారులను ఆదేశించారు.

ఒక వర్గాన్ని ప్రోత్సహించడం మంచి పద్ధతి కాదు


తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పులివెందుల : కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పోలీసుల ఆరాచకాలు ఎక్కువయ్యాయని, ఒకే వర్గాన్ని ప్రోత్సహించడం మంచి పద్ధతి కాదని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా పులివెందుల మండలం కొత్తపల్లెలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థికి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ పులివెందుల ప్రాంతంలో మేం లేకపోతే ప్రాణాలు తీసి ఉండేవారని స్వయానా డీఐజీ చెప్పడం చూస్తే.. దారుణమైన పరిస్థితి ఉందో అర్థమవుతోందన్నారు. లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన పోలీస్ అధికారులే మాట్లాడటం నీచమైన సంస్కృతి అని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎక్కడ చూసినా కూడా పోలీసు ఆరాచకాలే ఎక్కువయ్యాయని, ఒక వర్గాన్ని ప్రోత్సహించడం మంచి పద్ధతి కాదన్నారు. ఏదీ ఏమైనా రెండు, మూడు జిల్లాలకు సంబంధించి నటువంటి డీఐజీ ఈ మెసేజ్ ఇవ్వడమనేది బాధాకరమైన విషయమన్నారు. కిందిస్థాయి అధికారులు కూడా ఉన్నతాధికారి మెసేజ్‌ను బట్టి అలా చేయడం దారుణమన్నారు. గతంలో ఒక గ్రామంలో మూడు, నాలుగు ఇళ్లను ఓటు అడిగి వచ్చేవారని, క్రమేనా ప్రతి ఇంటికి వెళ్లి ఓట్లు వేయాలని అడగాలనే సంస్కృతి వచ్చిందన్నారు. ఇక్కడి ప్రజలు వైఎస్సార్ ఆశయాలు, వైఎస్సార్ కుటుంబంపై ఉన్న అభిమానంతో ఓటు వేస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడిన మునీంద్ర

కమలాపురం : కమలాపురం క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంనగర్‌కు చెందిన మునీంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు.. మునీంద్ర క్రాస్ రోడ్డు నుంచి కమలాపురం పట్టణంలోకి బైక్‌పై వస్తుండగా ఆర్బీ వద్ద వేగ నిరోధక హెచ్చరిక బోర్డును ఢీ కొన్నాడు. ఈ ఘటనలో తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉత్సాహంగా క్రీడల పోటీలు


బాక్సింగ్ ఆడుతున్న బాలికలు


బాస్కెట్ బాల్ ఆడుతున్న క్రీడాకారులు


కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : 2025 జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం క్రీడల పోటీలు ఉత్సాహంగా సాగాయి. నగరంలోని క్రీడా పాఠశాలలో అర్చరీ, హాకీ, వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు, డీఎస్‌ఏ క్రీడా మైదానంలో బాస్కెట్‌బాల్, వాలీబాల్, బాక్సింగ్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించగా క్రీడాకారులు ప్రతిభ చూపారు. ప్రతిభ చూపిన వారిని జట్టుగా ఏర్పాటుచేస్తామని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి తెలిపారు. ఎంపికైన జట్టు ఈ నెల 11న తిరుపతిలో నిర్వహించే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

మైలవరం జలాశయానికి నీరు విడుదల


మైలవరానికి తరలిస్తున్న కృష్ణజలాలు

కొండాపురం : గండికోట జలాశయం గేట్లు ఎత్తి మైలవరం జలాశయానికి ఐదువేల క్యూసెక్కుల నీటిని శుక్రవారం విడుదల చేసినట్లు జీఎన్‌ఎస్‌ఎస్ ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అవుకు రిజర్వాయర్ నుంచి జీఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా 13 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ప్రాజెక్టులోకి కొనసాగుతున్నట్లు తెలిపారు. జలాశయం పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా, ప్రస్తుతం జలాశయంలో 16 టీఎంసీల నిల్వలు ఉన్నాయని తెలిపారు. శెట్టివారిపల్లె మెయిన్ రెగ్యులేటర్ నుంచి గాలేరి నగరి సృజల స్రవంతి కాల్వ ద్వారా వామికొండ రిజర్వాయర్‌కు 300 క్యూసెక్కుల నీరు తరలిస్తున్నామన్నారు. గండికోట ఎత్తిపోతలపథకం ద్వారా నాలుగు మోటర్లతో నీటిని చిత్రావతి బ్యాలెన్స్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గండి ఆంజన్న దర్శనానికి ఏర్పాట్లు


గండి వీరాంజనేయుడు


శుక్రవారం రాత్రికే గండికి చేరుకున్న భక్తులు

చక్రాయపేట : శ్రావణమాసంలో మూడో శనివారం రోజున భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య, చైర్మన్ కావలికృష్ణతేజ తెలిపారు. అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం లడ్డూ, పులిహోర ప్రసాదాలను సిద్ధం చేశామని తెలిపారు. రాత్రి బసచేసే వారి కాలక్షేపానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ దాతలు అన్నదానం చేస్తారన్నారు. వీఐపీ పాసులు పొందినవారు నిర్ణయించిన సమయంలో వస్తేనే అనుమతిస్తామని తెలిపారు. ఉదయం ఐదు గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల లోపు వచ్చి దర్శనం చేసుకోవాలన్నారు. గత శనివారం జరిగిన తప్పిదాలను దృష్టిలో పెట్టుకుని మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు మాట్లాడుతూ ఉదయం మూడు గంటలకు సుప్రభాతసేవ, ఉత్సవమూర్తులకు అభిషేకం(ఏకాంతం), అలంకరణ, ఆరాధన, ఐదు గంటలకు మహామంగళ హారతి నిర్వహించి అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామని తెలిపారు.

స్వామి సన్నిధిలో తిరుపతి జిల్లా జడ్జి

గండి వీరాంజనేయ స్వామిని శుక్రవారం సాయంత్రం తిరుపతి జిల్లా జడ్జి రామచంద్రుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనచే ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్య, ఎస్సై రంగనాయకులు పాల్గొన్నారు. సీఐ మాట్లాడుతూ మూడో శనివారం కావడంతో పులివెందుల డీఎస్పీ మురళి ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, 15 మంది ఎస్సైలు, 200 మంది పోలీసులు, హోంగార్డులు, మహిళా పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు. వాహనాలను గండిలోకి అనుమతించమని వారు తెలిపారు.

కమ్ముకొస్తున్న కరువు మేఘం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా నేటికీ సరైన వర్షం కురవకపోవడంఒత అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. రోజులు గడుస్తున్న కొద్దీ కరువు మేఘం కమ్ముకొస్తోంది. ఎటు చూసినా బీడు భూములే దర్శనమిస్తున్నాయి. కేసీ కెనాల్ కింద మినహా చాలా ప్రాంతాల్లో అధిక శాతం బీడుగా దర్శనమిస్తున్నాయి. గతేడాది అధిక వర్షాలతో పంటలు దెబ్బతినడంతో నష్టాలను చవిచూసిన జిల్లా రైతులు తాజాగా వరుణుడి కరుణలేక నష్టపోతున్నారు.


కలసపాడు ప్రాంతంలో సాగుకు సిద్ధం చేసిన పొలం


కమలాపురంలో సాగు చేయకుండా వదిలేసిన పొలం

- ఖరీఫ్ ప్రారంభమైనా 14,467 హెక్టార్లలోనే పంటల సాగు
- కేసీ కెనాల్ కింద కాసింత సాగు ముమ్మరం

కడప అగ్రికల్చర్ : జిల్లా వ్యాప్తంగా 77475 హెక్టార్ల సాధారణ సాగుకుగానూ 14,467 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. ఇది కేవలం 18.67 శాతం మేర మాత్రమే. మరో 50 రోజుల్లో ఖరీఫ్ సీజన్ కూడా ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కరవు పరిస్థితి తప్పదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజులుగా అక్కడక్కడా కురుస్తున్న వర్షాలు కొంతమేర ఆశలు చిగురించినా ఏ మాత్రం పంటల సాగుపై ప్రభావం చూపడంలేదు. గత ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలు కురియడంతో రైతులు అశలు పెట్టుకున్నారు. జూన్‌లో ఖరీఫ్ మొదలయ్యే నాటికి వరుణుడు ముఖం చాటేయడం, జులైలోనూ సాధారణ వర్షపాతం 96.7 శాతం కాగా.. కేవలం 59.7 శాతం కురవడంతో ఆశలు నీరుగారిపోయాయి. ఆగస్టులో ఇప్పటి వరకూ 22.9మేర వర్షం కురిసింది.

18.67 శాతం భూముల్లోనే పంటల సాగు

జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో కేవలం 18.67 శాతం మేర వివిధ పంటలు సాగయ్యాయి. ఇంకా 80 శాతం భూములు బీడుగానే కనిపిస్తున్నాయి. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 77474 హెక్టార్లు ఉంది. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 14467.58 శాతం మేర పంటలు సాగయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. అడపాదడపా నీటివసతి లేని ఆరుతడి పంటలు ఎండుతున్నాయి. కేసీ కెనాల్ పరీవాహన ప్రాంతంలో 30,804 హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికి గానూ 6098 హెక్టార్లలో వరిపంట సాగైది.

నెల	సాధారణ వర్షపాతం (మి.మీలలో)	నమోదైన వర్షపాతం (మి.మీలలో)
జూన్	68.2	21.6
జులై	96.7	59.7
ఆగస్టు	118.8	22.9(ఇప్పటికి)

జొన్న 29 హెక్టార్లు, సజ్జ 689 హెక్టార్లు, మొక్కజొన్న 1728 హెక్టార్లు, కొర్ర 11.6 హెక్టార్లలో సాగు చేశారు. ఇక వేరుశనగ 926, పత్తి 3185, మినుము 1388 హెక్టార్లలోనూ సాగు చేశారు. కంది విస్తీర్ణం బాగా తగ్గిపోయి 112 హెక్టార్లకే పరిమితమైంది. సోయాబీన్ 45 హెక్టార్లలో సాగైంది. ఇంకా వర్షాలు కురవకపోవడంతో తాము పంటలు వేసే పరిస్థితి లేదని.. ఈ ఏడాది కరవు తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలు కురవలేదు



వర్షాలు సకాలంలో కురవడం లేదు. పంటల సాగు అంటే భయమేస్తోంది. వ్యవసాయం ఖర్చులు భారీగా పెరిగాయి. వర్షాభావ పరిస్థితుల్లో వేల రూపాయలు ఖర్చు పెట్టి పంట సాగుచేస్తే దిగుబడి వస్తోందో రాదో తెలియని పరిస్థితి. పంటల సాగుచేయడం అన్నా.. వ్యవసాయం అన్నా భయమేస్తోంది.

– పాలకొలను రమణారెడ్డి, రైతు, సిద్దిమూర్తిపల్లి, కలసపాడు మండలం

గతేడాది మినుము సాగు చేశా



గతేడాది ఈ సమయానికి మినుము పంట సాగు చేశా. ఈ ఏడాది భూములన్నీ బీడుగానే పెట్టుకున్నా. సరైన వర్షం కురవకపోవడంతో ఏ పంట సాగు చేయలేదు. విత్తనాలను సిద్ధం చేసుకున్నా.. పదునయ్యే వర్షం పడకపోవడంతో అలాగే ఉండిపోయాం. ఇకనైనా వర్షం కురిస్తే ఆరుతడి పంటలు సాగు చేసుకుంటాం... లేకుంటే ఈ ఏడాది కరవే.

– వెంకటసుబ్బారెడ్డి, కంచన్నగారిపల్లె, కమలాపురం మండలం

ఆరుతడి పంటలకు అనుకూలం...



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటల సాగుకు అనుకూలం. జొన్న, కొర్ర, మినుము, పొద్దుతిరుగుడు, కంది వంటి ఆరుతడి పంటలు సాగు చేసుకోవచ్చు. ఈ నెల 15వతేదీ లోపు వేరుశనగ పంట సాగు చేసుకోవచ్చు. సాగులో ఉన్న వరితోపాటు ఆరుతడి పంటలకు ఇప్పటి వర్షాలు కొంత మేలు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని బోడుమల్లదిన్నెకు చెందిన శ్రీనివాసులు, విజయమ్మ దంపతుల కుమారుడు వేణుగోపాల్(20) తల్లిదండ్రులు మృతి చెందడంతో తాత వెంకటరమణ వద్ద ఉంటున్నాడు. ప్రతిరోజూ పశువులను మేతకు తీసుకు వెళ్తూ చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఈ క్రమంలో ఇటీవల కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో ఇంట్లో వారు మందలించగా మనస్థాపానికి గురైన వేణుగోపాల్ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే విధంగా మొలకలచెరువు మండలం గుడ్రాజుపల్లికి చెందిన శంకర కుమారుడు మధుకర్(28) జెసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వారం రోజుల క్రితం కుటుంబ సమస్యలతో మధుకర్ భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్థాపం చెందిన మధుకర్ శుక్రవారం ఇంటివద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం వేణుగోపాల్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

రామయ్య సన్నిధిలో వరలక్ష్మీ వ్రతం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండరామాలయంలో వరలక్ష్మీ వ్రతం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలతో పవన్‌కుమార్, మనోజ్‌కుమార్‌లు శాస్త్రోక్తంగా వ్రతాన్ని చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తే ధన, ధాన్య, ఐశ్వర్యాలు కలుగుతాయని శాస్త్రాలు చెబుతున్నాయన్నారు. అనంతరం టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం సౌభాగ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు గాజులు, పసుపు, కుంకుమ, అక్షింతలు, పుస్తక ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ ప్రశాంతి, ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, సూపరింటెండెంట్ హనుమంతయ్య, భక్తులు పాల్గొన్నారు.

యువకుడి బొటనవేలు కొరికేసిన కానిస్టేబుల్



వీరబల్లి : భూ తగాదా విషయంలో యువకుడి బొటనవేలు కానిస్టేబుల్ కొరికేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడి వివరాల మేరకు.. వీరబల్లి మండలం ఈడిగపల్లిలో నివాసముంటున్న వీరబల్లి దయానందం కుమారుడు వేంకటేశ్వర్లు ప్రస్తుతం విజయవాడలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన వీరబల్లి శివకుమార్ కుమారుడు వినోద్ కుమార్‌తో వీరికి భూమి తగాదా ఉంది. శుక్రవారం ఈ విషయపై ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో మాటామాటా పెరగడంతో ఆగ్రహంతో వినోద్‌కుమార్ బొటనవేలును వేంకటేశ్వర్లు కొరికేయగా, అతడి కుమారుడు వినయ్ వినోద్ కుమార్ కారును పగులగొట్టారు. ఈ సంఘటనపై వినోద్‌కుమార్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్, అతడి కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరసింహారెడ్డి తెలిపారు.